క్లుప్తంగా

'హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం' సదస్సు రేపు

నెల్లూరు(బృందావనం) : పుర మందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో శనివారం సాయంత్రం 5 గంటలకు 'హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం' అనే సదస్సును నిర్వహిస్తున్నట్లు సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ గురువారం తెలిపారు. సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఔత్సాహికులు 78938 47709 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏఆర్ హెచ్‌సీ సస్పెన్షన్

నెల్లూరు(క్రైమ్) : విధులకు గైర్హాజరవడంతో ఏఆర్ హెచ్‌సీ మధుసూదనరావును సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

భోగ శ్రీనివాసుని వెండి విగ్రహం బహూకరణ



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి స్థానికుడు చీమకుర్తి శివకుమార్–వాణి దంపతులు భోగ శ్రీనివాసమూర్తి వెండి విగ్రహాన్ని గురువారం బహూకరించారు. దాతలకు దేవస్థానం కమిటీ వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శివకుమార్ దంపతులు 10 కిలోల వెండితో రూ.11 లక్షలు ఖర్చు చేసి విగ్రహాన్ని తయారు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్యనాయుడు మాట్లాడుతూ త్వరలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న తరుణంలో భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని అందజేయడం భగవత్ సంకల్పంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, వేణుగోపాల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంతో నైపుణ్యం పెంపు



వేసిన బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొడవలూరు : చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం వారితో నీతి కథలు చెప్పించడం చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీతి కథలు చదివి వినిపించడం ద్వారా విద్యార్థుల్లో వినికిడి సామర్థ్యం పెంపొందుతుందన్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకు కొనసాగే వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

ఆరు సవర్ల బంగారు నగల చోరీ

పొదలకూరు: మండలంలోని ముదిగేడు గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన అక్కెం అంకిరెడ్డి కుటుంబం బుధవారం రాత్రి తిరునాళ్లకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు అతని ఇంట్లోకి వెళ్లారు. బీరువాలో దాచిన ఆరు సవర్ల బంగారు నగలను దొంగిలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ బైక్ అపహరణ

వెంకటాచలం : రోడ్డు పక్కన నిలిపిన మోటారు బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన వెంకటాచలంలో గురువారం జరిగింది. వెంకటాచలానికి చెందిన గంటా బాబు ఏపీ 39 బీఆర్ 3764 నంబర్ గల తన మోటారు బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి నిజాం అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి పది నిమిషాల తరువాత వచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయ రాబడి రూ.6.80 లక్షలు

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయ హుండీ రాబడి రూ.6,80,749లు అని ఆలయ ఈఓ బండి శాంతయ్య తెలిపారు. జనవరి 6 నుంచి ఇప్పటి వరకు హుండీ ఆదాయం రూ.6,55,850 కాగా, అన్నప్రసాద వితరణకు రూ.24,899లను భక్తులు సమర్పించారని చెప్పారు. కార్యక్రమంలో మస్తాన్‌బాబు, కెనరా బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీహరి, విద్యాసాగర్‌రావు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మినరల్ పేరిట మోసం

- ప్లాంట్ల నిర్వహణపై అనేక సందేహాలు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి అమ్మకం
- రుచి కోసం కెమికల్స్ కలుపుతున్న వైనం



నగరంలోని ఓ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

నెల్లూరు(బారకాసు) : నగర ప్రజలు మినరల్ వాటర్‌కు పూర్తిస్థాయిలో అలవాటు పడిపోయారు. దీంతో నగర పరిధిలో వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇప్పటికే దాదాపు 200 నుంచి 300 వరకు ప్లాంట్లు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయి. కానీ దాదాపు అన్ని ప్లాంట్లలో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. పేరుకే మినరల్ వాటర్ అయితే అంతర్జాతీయ ప్రమాణాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదో విధంగా అనుమతులు తెచ్చుకుని సాదాసీదాగా క్యాన్‌లలో నీరు నింపుతున్నారు. ఇలాంటి నీటిని తాగితే జుట్టు రాలిపోవడం, అతిసారా, కిడ్నీ సంబంధిత వ్యాధులు విజృంభిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చౌకగా ప్లాంట్ల నిర్మాణం

అన్ని ప్రమాణాలు పాటించి మినరల్ వాటర్ అందించాలంటే భారీ వ్యయం చేయాల్సిందే. కానీ నెల్లూరు నగరంలో చాలా చోట్ల కేవలం రెండు నుంచి మూడు లక్షల రూపాయలతో చిన్నచిన్న వాటర్ ప్లాంట్లు వెలుస్తుండడం గమనార్హం. వీరు బోరు వేయించిన తర్వాత ప్లాస్టిక్ ట్యాంకులను కొనుగోలు చేస్తున్నారు. అతి చౌకగా ప్యూరిఫైడ్ మిషనరీ తీసుకుని నీటిని శుద్ధి చేస్తున్నారు. సోడియం, కార్బొనేట్, సోడియం క్లోరైడ్, శాక్రిన్ కలిపి నీటికి రుచి తెస్తున్నారు. ఆ తర్వాత యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ల్యాబ్ టెస్టింగ్ గానీ, వాటర్ క్యాన్‌లపై తయారీ తేదీ (ఎంఎఫ్‌డీ) కూడా ఉండదు. అయినప్పటికీ అధికారులు ఉలుకూ.. పలుకూ లేకుండా ఉంటారు.

ఇష్టమొచ్చిన రేటుకు అమ్మకాలు

నిబంధనలు పట్టించుకోకుండా నీటిని ప్యాక్ చేయడమే కాకుండా రేట్లను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. 200 వాటర్ ప్యాకెట్లున్న బ్యాగును రూ.50కి విక్రయిస్తుండగా.. విడిగా ఒక్కో ప్యాకెట్ రెండు రూపాయలకు అమ్ముకుంటున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం మీద నీటి వ్యాపారం టర్నోవర్ రూ.కోటి పైగానే ఉండొచ్చని అంచనా.



ఆటోలో మినరల్ వాటర్‌ను తీసుకొచ్చి క్యాన్‌లలో నింపుతున్న వైనం

నిబంధనలు ఇవీ..

- ప్లాంట్ కోసం కనీసం 2,200 చదరపు మీటర్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలి.
- నీటిని నిల్వ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులనే వాడాలి.
- పంపింగ్ చేసేటప్పుడు కూడా స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులనే ఉపయోగించాలి.
- అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్ర పరచాలి.
- నీటిలోని వైరస్, బ్యాక్టీరియాను నాశనం చేయడానికి అల్ట్రావైలెట్ సిస్టమ్‌ను పాటించాలి.
- బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- శుద్ధి నీటిని నిపుణుల ద్వారా పరీక్షించాలి. తరువాతే మార్కెట్‌లో విక్రయించాలి.
- రేడియో యాక్టివిటీ టెస్ట్, ప్యాకింగ్ మెటీరియల్ టెస్ట్, కంప్లీట్ అనాలసిస్ ఇన్‌క్లూడింగ్ పెస్టిసైడ్ టెస్ట్‌లతో పాటు అనేక పరీక్షల అనంతరం బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) కంపెనీ ఐఎస్ఐ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తుంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాటర్ ప్లాంట్ల యజమానులు ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకే మినరల్ వాటర్‌ను విక్రయించాలి. అలా కాకుండా ఇష్టానుసారం మినరల్ వాటర్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవు. ఇటీవల మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేసినప్పుడు అందులో వాటర్‌ప్యాకెట్లపై తయారీ, ఎక్స్‌పెయిరీ తేదీ తదితర వివరాలు లేకపోవడంతో వాటిని అక్కడికక్కడే స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశాం. అంతేకాకుండా సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించాం. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రమాణాలు పాటించాల్సిందే. లేనిపక్షంలో చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వెంకటరమణ, ఎంహెచ్‌ఓ, నగరపాలక సంస్థ, నెల్లూరు

ప్రణాళికాబద్ధంగా కౌంటింగ్ ప్రక్రియ



ప్రియదర్శిని కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

- సిటీ ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు) : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కౌంటింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ ఆర్వో వికాస్‌మర్మత్ జిల్లా కౌంటింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. స్థానిక కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌తో కలిసి కమిటీ సభ్యులంతా గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ హాళ్లలో చైర్లు, టేబుళ్ల ఏర్పాటు, ఇంటర్నెట్, కేబుల్స్, ల్యాప్‌టాప్స్, ప్రింటర్లు, స్కానర్లు, సీసీ కెమెరాలు వంటి సాంకేతిక పరికరాలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలని సూచించారు. తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ మలోలా, అడిషనల్ ఎస్పీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, రూరల్ తహసీల్దార్, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గౌతమ బుద్ధునికి ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని నెల్లూరు చెరువు వద్ద ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహానికి జిల్లా సహకార శాఖాధికారి(డీసీఓ) గుర్రప్ప గురువారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని బోధనలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం గాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చకుడు బి.శ్రీనివాసాచార్యులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణీమల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని రామ్మూర్తినగర్ విద్యుత్ సబ్‌డివిజన్ రేబాల ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఉస్మాన్‌సాహెబ్‌పేట శివాలయంలో రథోత్సవం నిర్వహిస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేట, రేబాలవీధి, ప్రకాష్‌నగర్, ఎన్టీఆర్ లేఅవుట్, స్టాన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- ఏకేనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డుగా చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సావిత్రీనగర్, గాయత్రీనగర్, వేదాయపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

అన్నదానం



నెల్లూరు(బృందావనం) : పడారుపల్లిలోని ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ గురుమేటి రుద్రాంక్ష్ తొలి పుట్టిన రోజును పురస్కరించుకుని తల్లిదండ్రులు దీప్తి, పవన్‌కుమార్ సౌజన్యంతో కాలనీలోని దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో కె.జానకిరామయ్య, ప్రమీలమ్మ, గీత, సీత, గుమ్మడి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కాశీవిశ్వనాథుని కల్యాణం



నెల్లూరు(బృందావనం) : ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అన్నపూర్ణాదేవి, కాశీ విశ్వనాథస్వామి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. దేవస్థానం అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. ఉభయకర్తలుగా ఎస్వీఎస్ రాఘవేంద్రరావు, గిరిజ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ జి.దర్గయ్య, మహేష్ పాల్గొని పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుందని ఈఓ దర్గయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్యుల స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బ్రహ్మశ్రీ ఓరుగంటి శ్రీరామలాలశర్మ గురువారం ప్రవచించారు. పౌర్ణమి సందర్భంగా లలితా సహస్రనామ స్తోత్ర సామూహిక పారాయణం చేశారు. సభా పోషకులుగా సర్వేపల్లి శ్రీనివాసరావు, పాలేటి ఛాయాకుమారి, చక్రాల నాగరత్నకుమారి, మల్లవరపు రాధాలక్ష్మి, దేవసేన, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

వెంకటాచలం రైల్వే గేటు మూత

వెంకటాచలం : మండల కేంద్రమైన వెంకటాచలంలోని రైల్వేగేటును మరమ్మతుల కారణంగా వారం రోజుల పాటు మూత వేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ గేటు వద్ద రైలు పట్టాలు, రోడ్డును బాగు చేసే పనులు గురువారం ప్రారంభమయ్యాయని తెలియజేశారు. ఈనెల 29వ తేదీ వరకు పనులు జరుగుతాయని, ఈ మార్గంపై రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు ఇతర మార్గాల గుండా వెళ్లాలని కోరారు. రైల్వే గేటు మూత పడడంతో ప్రయాణికులు తిక్కవరప్పాడు మీదుగా నెల్లూరుకు రాకపోకలు కొనసాగిస్తున్నారు.



రైల్వే గేటు వద్ద పనులు చేయిస్తున్న అధికారులు

క్రీడాభారతి నూతన కమిటీ ఎన్నిక



క్రీడాభారతి జిల్లా నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు (టౌన్) : క్రీడా భారతి జిల్లా నూతన కమిటీని గురువారం స్థానిక పెద్ద బజారులోని మేధా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్రీడా భారతి జిల్లా ప్రెసిడెంట్‌గా కొండారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా సుబ్బయ్య, రానా ప్రమోద్‌రెడ్డి, లక్ష్మి, మల్లికార్జున్, జనరల్ సెక్రటరీగా సీహెచ్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఇమ్రాన్, ట్రెజరర్‌గా శ్రీహరిరెడ్డి, సభ్యులుగా మురళీ, రఘురామిరెడ్డి, కోటారెడ్డి, శ్రీనివాస్, దివ్యప్రకాష్, దిలీప్, శ్రీధర్, ప్రసన్న, సౌమ్య, విజయకుమారి, వెంకటేశ్వరి, మౌనిక, నవీన్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సమీర్ నియమితులయ్యారు. కమిటీ అబ్జర్వర్లుగా క్రీడాభారతి ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రెవెన్యూ డివిజన్లలో నూతన కమిటీలను నియమించామన్నారు. క్రీడా భారతి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసి ఎక్కువ మంది క్రీడాకారులను తయారు చేసి 2036 ఒలింపిక్స్‌లో దేశం తరపున అధిక మెడల్స్‌ను సాధించే విధంగా క్రీడాభారతి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్స్, జాతీయస్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు ఆన్‌లైన్లో శిక్షణ



ఆన్‌లైన్ శిక్షణలో డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు గురువారం ఆన్‌లైన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) గుర్రప్ప ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో ఉన్న 78 పీఏసీఎస్‌లు, సహకార శాఖ ఆడిట్ అధికారులతో శిక్షణా తరగతులు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లను వేగవంతంగా కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటైన కామన్ సర్వీస్ సెంటర్లకు ఐడీ కార్డులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా ఇప్పటి వరకు రూ.2.55 కోట్ల ఆదాయం రాగా, జిల్లాలో రూ.3.80 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా జిల్లాలో పెట్రోల్ బంకుల ఏర్పాటు, జనరిక్ మందుల దుకాణాలను పెంచడంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సహకారశాఖ రాయచోటి అసిస్టెంట్ రిజిస్ట్రార్ హబీబుల్లా, నెల్లూరు డీసీఏఓ తిరుపతయ్య పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ ఈ సంఘం ద్వారా రాష్ట్రంలోని బీసీలను ఏకం చేసి చైతన్య సభలు నిర్వహించడం, అన్నదానాలు, అగ్నిప్రమాద బాధితులకు సాయం చేయడం, పేద బీసీ విద్యార్థులకు ఆర్థిక సాయం వంటివి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుబ్బయ్య, జ్యోతి, రాము, జయరామరాజు, విజయ్‌కుమార్, చంద్ర పాల్గొన్నారు.

రసాయన ఎరువులను తగ్గించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు సిటీ : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్.శ్రీనివాసులు పేర్కొన్నారు. రూరల్ మండలంలోని కలివెలపాళెం, వావిలేటుపాడు గ్రామాల్లో రైతులతో భూసార పరిరక్షణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు భూసారం కోసం పశువుల ఎరువు, పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అభిలాష్, సుజిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్నమాచార్యులకు పుష్పాంజలి

నెల్లూరు(బృందావనం) : మినీబైపాస్‌రోడ్డులోని అన్నమయ్య సర్కిల్‌లో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి శ్రీశ్రీనివాస నాట్యమండలి నిర్వాహకులు టి.హరగోపాల్, వి.మస్తానయ్య పుష్పాంజలి సమర్పించారు.

